వందశాతం పన్నులు వసూలు చేయాలి

కుంటాల.. కల్లూరులో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

నిర్మల్ టౌన్, మార్చి 22: ఈ నెల 31న ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున జిల్లా లోని అన్ని గ్రామాల్లో వందశాతం పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ మండలాల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పన్నుల వసూళ్లపై అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లా లోని 18 మండలాల్లో వందశాతం పన్నులు వసూల్ చేయాలని సూచించారు. ఇప్పటి వరకు ఏ మండలంలో ఎంత పన్ను వసూలైంది, ఇంకా ఎంత ఉంది, ఈవారం రోజుల్లో ఎంత వసూలు చేస్తారో అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పన్నుల వసూలుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ కార్యదర్శులు ప్రతి ఇంటికీ తిరిగి లోకల్, నాన్ లోకల్ పన్నులు రాబట్టాలని సూచించారు. పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీవోలు ప్రతిరోజూ మానిటరింగ్ చేయాలన్నారు. సమావేశంలోఎంపీవోలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని చేరుకోవాలి

కుంటాల, మార్చి, 22 : పన్ను వసూళ్లపై దృష్టి సారించి, ఈ నెల 31 లోగా లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ ఆదేశించారు. శుక్రవారం ఆయన కల్లూరు గ్రామపంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, డంప్ యార్డు, వైకుంఠధామం, నర్సరీ, పార్కును పరిశీలించి మాట్లాడారు. సమయ పాలన పాటించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఇక్కడ కార్యదర్శి భోజన్న, కారోబార్ మోహన్ ఉన్నారు.

తాగునీటి పైప్‌లైన్ వేసిన అధికారులు

పైప్‌లైన్ వేయిస్తున్న మిషన్ భగీరథ ప్రాజెక్టు మేనేజర్, డీఈఈ

నమస్తే కథనానికి స్పందన

నిర్మల్ అర్బన్, మార్చి 22: నిర్మల్ పట్టణంలోని మహాదేవ్‌పురం కాలనీలో తాగునీటి ఇబ్బందులపై నమస్తే తెలంగాణలో ప్రచురితమైన వార్తకు నిర్మల్ మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. కాలనీవాసులు ఇష్టారీతిన డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్వకాలు జరుపడంతో పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడి నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. మిషన్ భగీరథ ప్రాజెక్ట్ మేనేజర్ శర్వానంద్, డీఈఈ సంతోష్‌కుమార్ శుక్రవారం దగ్గరుండి పైప్‌లైన్ వేయించి తాగునీటి ఇబ్బందులను తీర్చారు. దీంతో కాలనీవాసులు నమస్తే తెలంగాణ, మిషన్ భగీరథ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి పీఆర్‌టీయూ ఆర్థిక సాయం

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

దిలావర్‌పూర్, మార్చి 22: దిలావర్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం పనిచేసిన వెంకటనర్సయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన పీఆర్‌టీయూలో క్రియాశీలక సభ్యత్వం కలిగి ఉండడంతో సంఘం తరుపున బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం దిలావర్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో రూ. లక్ష చెక్కును అందించారు. ఇక్కడ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు , మండల విద్యాధికారి శంకర్, ఉపాధ్యాయులు రమణారావు, సదానందం, చిన్నయ్య తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

By This deed I, The undersigned **NEHA D/o MOHAMMED RAFEEQ** H.NO.8-1-133/8,Shanthi Nagar ,Nirmal Town & Mandal, Nirmal Dist. TS. 504106. have Changed My Name to **NEHA RAFEEQ D/o MOHAMMED RAFEEQ** For All Future Purpose

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

నీటిని పొదుపుగా వాడుకోవాలి

- సహజ వనరులు నీటి ఆవశ్యకతపై ప్రముఖుల అవగాహన
- జిల్లాలో ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవం
- పాల్గొన్న నాయకులు, అధికారులు, విద్యార్థులు

కుంటాల.. ఓలాలో ఉపాధి కూలీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

నిర్మల్ అర్బన్: నీటి ప్రాధాన్యతను చార్టుల ద్వారా వివరిస్తున్న విద్యార్థులు

నిర్మల్ అర్బన్, మార్చి 22 : నిర్మల్ పట్టణంలోని అర్బన్ కేజీబీవీలో శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నీటి ప్రాధాన్యతను వివరిస్తూ అందమైన బొమ్మలను గీశారు. కార్యక్రమంలో బయోసైన్స్ టీచర్ శైలజ, ఎస్‌వో సుజాత, ఉపాధ్యాయులు గీతారాణి, స్వప్న ఉన్నారు.

మహాగాంలో ర్యాలీ..

భైంసాటౌన్, మార్చి 22 : మహాగాంలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా సీఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు నీటి అవసరాన్ని వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలను నిర్మించుకొని నీటిని పొదుపుచేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌డీ విస్తరణ అధికారి భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు ముత్యంరెడ్డి, రవి, జాదవ్ శివరాం, సాయారెడ్డి, సారనాథ్, విక్రాంతి, వర్ష, చంపత్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం నీటిని ఒడిసి పడుదాం

సోన్, మార్చి 22: సోన్ మండలం కూచన్‌పల్లి గ్రామంలో శుక్రవారం వరల్డ్ వాటర్ డే కార్యక్రమం నిర్వహించారు. భవిష్యత్తులో నీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టుకుందామని ఎంపీడీవో సురేశ్ అన్నారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధిహామీ సిబ్బంది, కూలీలు ఉన్నారు.

నీరు అత్యంత విలువైన వనరు

కుంటాల, మార్చి 22 : ప్రపంచంలో అత్యంత విలువైన వనరుల్లో నీరు ఒకటని మహిళా అభివృద్ధి సంస్థ జిల్లా సమన్వయకర్త మేత్రి ప్రవీణ్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా కల్లూరులో గ్రామ సంఘ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నీటి వనరులు అమూల్యమైనవి, పరిమితమైనవని వీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం విజయలక్ష్మి, ఏపీఎంలు అశోక్, మల్లేశ్, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

ఉపాధి కూలీలకు అవగాహన

ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా భూగర్భ జలాల ప్రాముఖ్యత, నీటి వినియోగం పై అవగాహన కల్పించినట్టు ఉపాధిహామీ ఏపీవో నవీన్ తెలిపారు. ఓలా గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. బోర్‌వెల్ రీచార్జ్, చెక్‌డ్యాం పూడికతీత పనులు, ఇంకుడు గుంతల గురించి వివరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఏ రహీం, టీఏ కార్తీక్, పీఎస్ యోగేశ్, ఎఫ్ఏ వాణి, కూలీలు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో ..

బాసర, మార్చి 22 : ఆర్జీయూకేటీ బాసరలో శుక్రవారం అంతర్జాతీయ జల దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ సైంటిస్ట్ ప్రమోద్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌బాబు, సివిల్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ శాంతి జగదీశ్వరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణకు చర్యలు తీసుకోవాలి

దిలావర్‌పూర్: కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందిస్తున్న తహసీల్దార్ స్వాతి

ఖానాపూర్: మాట్లాడుతున్న ఎంపీడీవో సునీత

ఖానాపూర్, మార్చి 22: వేసవికాలం ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ప్రజలకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని ఎంపీడీవో సునీత అధికారులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆశ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రజలు అవసరమయితే తప్ప బయటకు వెళ్లరాదన్నారు. వడదెబ్బ తగలకుండా ఆశ వర్కర్లు అందించే ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు మజ్జిగ తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అనారోగ్య సమస్యలున్నా వైద్యులను సంప్రదించాలని తెలిపారు. తహసీల్దార్ శివరాజ్, ఎంపీవో చంద్రశేఖర్, ఆశవర్కర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి

దిలావర్‌పూర్, మార్చి 22: ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు తీవ్రమైన ఎండల నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ స్వాతి సూచించారు. శుక్రవారం న్యూలోలంలో చెరువులో పూడిక తీత పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి మాట్లాడారు. పనులకు వేకువనే వెళ్లాలని, పని చేసే సమయంలో ఓఆర్ఎస్ తాగాలని సూచించారు. ఇక్కడ ఆర్ఐ సంతోష్, ఈజీఎస్ ఎఫ్ఏ గోవిందుల మహేశ్ తదితరులున్నారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి

దస్తురాబాద్, మార్చి 22 : వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ సర్ఫారాజ్ నవాజ్, ఎంపీడీవో రమేశ్ సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సంబంధిత అధికారులతో కలిసి వడ దెబ్బపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మరుగుదొడ్లు, ఉపాధి హామీ పథకం, నర్సరీల సంరక్షణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వేసవిలో వీచే వడ గాలులతో వడ దెబ్బ తగిలే ప్రమాదముందన్నారు. ఓఆర్ఎస్ ప్యానెట్లను గ్రామ పంచాయతీలు, ఆశ కార్యకర్తల వద్ద అందుబాటులో ఉంచాలని సూచించారు. అవసరమైన చోట చలి వేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉపాధి కూలీలతో ఉదయం, సాయంత్రం పనులు చేయించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో 108 సేవలు వినియోగించుకోవాలన్నారు. మరుగుదొడ్లను తనిఖీ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, నర్సరీల్లో వందశాతం మొక్కలు పెరిగేలా చూడాలని ఆదేశించారు. ఇక్కడ డాక్టర్ చందన, ఎంపీవో అనిల్‌కుమార్, హెచ్ఈవో వేణుగోపాల్, హెచ్‌వీ లలిత, టీఏలు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ముధోల్ నియోజకవర్గానికి రూ. 140 కోట్లు మంజూరు

భైంసా, మార్చి, 22 : ముధోల్ నియోజకవర్గానికి రూ. 140 కోట్లు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే రామారావు పటేల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముధోల్ – పంచగుడి డబుల్ లైన్ రోడ్డుకు రూ. 30 కోట్లు, ముధోల్ అంబేద్కర్ చౌక్ – గాంధీ చౌక్ , శివాజీ చౌక్ వరకు రూ. 8 కోట్లు, అంతర్ని ఎక్స్ రోడ్డు – దివిసికి రూ. 2 కోట్ల 50 లక్షలు, వీర్‌గావ్ తండా – మర్లగొండకు రూ. కోటి, తానూర్ – ఎంహెచ్ బార్డర్‌కు రూ. 8 కోట్లు, పిప్రి లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ. 18 కోట్లు, సిరాల ప్రాజెక్టుకు రూ. 12.37 కోట్లు, కనకాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ. కోటీ 40 లక్షలు, కస్తూర్బా జూనియర్ కళాశాల ముధోల్‌కు రూ. 2 కోట్ల 30 లక్షలు, గోపాల్‌రావు పటేల్ డిగ్రీ కళాశాలకు రూ. 5 కోట్లు, పాఠశాలల్లో టాయిలెట్స్‌కు రూ. 9 కోట్ల 80 లక్షలు, ఏరియా దవాఖాన డెవలప్‌మెంట్‌కు రూ. 35 కోట్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీల కు రూ. 12.80 కోట్లు, సీసీ రోడ్లు పెండింగ్ పనుల కోసం రూ. 27 కోట్లు, మండలాల్లో తాగునీటికి రూ. కోటీ 76 లక్షలు మంజూరయ్యాయని వెల్లడించారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ప్రధానమంత్రి మోదీ, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, ధర్మేంద్ర ప్రధాన్‌జీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తం కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్కకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మద్యం పట్టివేత

భైంసా, మార్చి 22: పట్టణంలోని బైల్‌బజార్‌వద్ద బెల్టు షాపుపై దాడిచేసి రూ. 6 వేల విలువైన 13.5 లీటర్ల మద్యం పట్టుకున్నట్లు సీఐ రాజారెడ్డి తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అక్రమ మద్యాన్ని అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్వాహకులు శివపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముధోల్, మార్చి 22 : మండలంలోని గన్నోరా, బోరిగాంలోని బెల్టు షాపుల్లో రూ. అక్రమంగా విక్రయిస్తున్న రూ. 55 వేల విలువైన మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ సాయికిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

నిరుపయోగంగా మోడల్ చేపల మార్కెట్

తాళం వేసి ఉన్న మోడల్ మార్కెట్

నిర్మల్ టౌన్, మార్చి 22: జిల్లా కేంద్రంలో చేపల విక్రయానికి నిర్మించిన మోడల్ చేపల మార్కెట్‌కు తాళం పడింది. తెలంగాణ ప్రభుత్వం రూ.50 లక్షలతో మార్కెట్‌ను నిర్మించారు. మార్కెట్ సముదాయంలో చేపల విక్రయాలు జరుగకపోవడంతో మత్స్య కార్మికులు, ఇటు ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో 6 నెలల క్రితం ఈ మార్కెట్ నిర్మాణం పూర్తి చేశారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సహకారంతో సమగ్ర మత్స్య పథకం కింద ఈ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం భాగ్యనగర్ లోని చౌరస్తా వద్ద రోడ్డుపైనే చేపల విక్రయాలు జరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. ఉదయం, సాయంత్రం చేపలు కొనడానికి వచ్చిన వారికి కష్టాలు తప్పడం లేదు. ఈ ఇబ్బందులను తొగించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 50 లక్షలు మంజూరు చేయడంతో కొత్త మార్కెట్ నిర్మించి మంత్రి అల్లోల ప్రారంభించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అక్కడ చేపల విక్రయాలు మూన్నాళ్ల ముచ్చటగా మారాయని మత్స్యకార్మికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ మార్కెట్ ప్రధాన గేటుకు తాళం వేయడంతో పాత స్థలంలోనే చేపల విక్రయాలు జరుగుతున్నాయి. కొత్త మార్కెట్ నిరుపయోగంగా మారడంతో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. బ్లాక్‌లు ఇతర సామగ్రికి రక్షణ కరువైపోవడంతో ప్రభుత్వ ధనం దుర్వినియోగం కావడమే గాక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దీనిపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు మార్కెట్‌కు ఉన్న తాళం తొలగించి చేపల విక్రయాలు వెంటనే ప్రారంభించాలని కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా అధికారి వివరణ కోరగా త్వరలో ప్రజలకు అందుబాటులో తెస్తామని వివరించారు.

చెక్‌పోస్ట్‌ల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలి

చించోలి(బీ) చెక్‌పోస్ట్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సారంగాపూర్, మార్చి 22: చెక్‌పోస్ట్‌ల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అశీష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం చించోలి(బీ) ఎక్స్ రోడ్డు వద్ద లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేసి మాట్లాడారు. మద్యం, నగదు అక్రమ రవాణా జరుగకుండా నిఘా వ్యవస్థను మరింత పటిష్టంగా చేపట్టాలని సూచించారు. ఇప్పటివరకు చేపట్టిన వాహనాల తనిఖీల వివరాలను అడిగి తెలుసు కున్నారు. వాహనాల తనిఖీకి సంబంధించి వీడియోగ్రఫీ చేయాలని తెలిపారు. ఆయన వెంట ఆర్‌డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్ శ్రీదేవి, సిబ్బంది ఉన్నారు.

సెల్‌ఫోన్ పోతే ఆందోళన చెందవద్దు

బాధితులకు సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఎస్పీ

నిర్మల్ అర్బన్, మార్చి 22 : సెల్ ఫోన్‌పోతే ఆందోళన చెందవద్దని ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల అన్నారు. శుక్రవారం నిర్మల్ పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో 103 మంది బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా నూతన టెక్నాలజీ సహకారంతో ట్రేస్ చేసి రికవరీ చేస్తున్నామని చెప్పారు. ఈవెబ్‌సైట్ ద్వారా ఇప్పటి వరకు 596 ఫోన్‌లను ట్రేస్ చేసి బాధితులకు అందించామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ గంగారెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, పట్టణ సీఐ అనిల్, ఐటీ కోర్ ఇన్‌చార్జి రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలి

మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్న

నిర్మల్ అర్బన్, మార్చి 22 : ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్‌ను నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు రెగ్యులర్ బీఈడీ, డైట్ వారితో సమానంగా టెట్ (ఉపాధ్యాయ అర్హత) నిర్వహించడం సమంజసం కాదన్నారు. 50 సంవత్సరాలు పైబడిన వారికి, 2010 కన్నా ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానకార్యదర్శి లక్ష్మణ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీనివాస్, బీవీరావు ఉన్నారు.

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక కృషి

కుభీర్ : పోషణ ప్రతిజ్ఞ చేస్తున్న టీచర్లు, మహిళలు

కుభీర్, మార్చి 22 : చిన్నారులతో పాటు గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికల ఆరోగ్య పరిరక్షణకు స్త్రీ శిశు సంక్షేమశాఖ విశేష కృషి చేస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని శివ సాయి ఆలయంలో పోషణ్ పక్వాడాలో భాగంగా కుభీర్ క్లస్టర్‌లోని 25 కేంద్రాల ఆధ్వర్యంలో తల్లులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నప్రాసన, అక్షరాభ్యాసం, సీమంతాలు చేశారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు, కూరగాయల ప్రదర్శన నిర్వహించి వాటి ప్రాధాన్యతపై వివరించారు. అనంతరం మహిళలతో కలిసి ఆరోగ్య ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తిప్ప అరుణ, యశోద, వనమాల, గాయత్రి, కృష్ణవేణి, సత్యశీల, శోభ, జ్యోతి, శైలజ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్, మార్చి 22: కాల్వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషన్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు, బాలికలు సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ ప్రసన్నకూమారి, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 22: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు సావిత్రి అన్నారు. నిర్మల్ పట్టణంలోని ఆస్రాకాలనీలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో టీచర్లు హేమలత, శ్యామల పాల్గొన్నారు.

జిల్లా సంక్షేమాధికారిగా నాగమణి

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 22: జిల్లా సంక్షేమాధికారిగా నిర్మల్ ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత డీడబ్ల్యూవో రమేశ్ ధీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో సీడీపీవో నాగమణికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

భైంసా, మార్చి 22 : లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్రంలో మళ్లీ వచ్చేది బీజేపీయేనన్నారు. ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు భీంరావు, పండిత్ రావు, గంగాధర్, దత్తాత్రి, చిన్నారెడ్డి ఉన్నారు.

కనీస వసతులు కల్పించాలి

నిర్మల్ టౌన్, మార్చి 22: జిల్లా కలెక్టరేట్‌లో వివిధ పనుల కోసం వస్తున్న ప్రజలకు కనీస వసతులు కల్పించాలని కోరుతూ సీపీఐ నాయకులు విలాస్, రమేశ్ శుక్రవారం ఏవోకు వినతి పత్రం అందించారు. మరుగుదొడ్లు ఉన్నా అవి వీఐపీలకు మాత్రమే అని, ప్రజలకు కావని సిబ్బంది అంటున్నారని విన్నవించారు. తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళలకు శిక్షణ

నిర్మల్ టౌన్, మార్చి 22: యాక్సెంజర్ ఐడిల్ ఆధ్వర్యంలో మహిళలకు హౌస్ హోల్డ్ సప్లయిస్ ద్వారా ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్మల్‌లో నిర్వహించారు. శుభ్రతలో మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షకురాలు రజిత వివరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ముడిసరుకుల వినియోగంపై అవగాహన కల్పించారు. సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సోన్, మార్చి 22: నిర్మల్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన నరేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో శుక్రవారం నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంగ్వాపేట్ మాజీ సర్పంచ్ గంగయ్య ఆరోగ్యం బాగా లేకపోవడంతో వారిని కూడా పరామర్శించారు. ఇక్కడ పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజారెడ్డి, మాజీ సర్పంచులు సాయన్న, గంగాధర్, నవీన్ ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

ముధోల్, మార్చి, 22: ముధోల్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే రామారావు పటేల్ ఎంతగానో కృషి చేస్తున్నట్లు బీజేపీ మండల నాయకులు తెలిపారు. ముధోల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రూ. 140 కోట్ల నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు వెల్లడించారు. ప్రభుత్వ దవాఖాన, అగ్రికల్చర్ డిప్లొమా కాలేజ్, మార్కెట్ యార్డు నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇక్కడ ముధోల్ మండల ఇన్‌చార్జి రమేశ్, అధ్యక్షుడు పోతన్న, దశరథ్, ముత్యంరెడ్డి ఉన్నారు.

నాణ్యతను పరిశీలించాకే బిల్లులివ్వాలి

కుభీర్, మార్చి 22 : ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించాకే బిల్లులు అందించాలని కోరుతూ కుభీర్‌కు చెందిన ఎస్జేహెచ్ఆర్‌సీ ప్రతినిధి సాప పండరి శుక్రవారం నిర్మల్ పీఆర్ ఈఈకి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో చేపట్టిన పనులను పరిశీలించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు చర్యలు

పెంబి, మార్చి 22: విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని వి